క్లుప్తంగా

గోశాలకు పశుగ్రాసం వితరణ



గోశాలకు ట్రాక్టర్‌లో తరలించిన పశుగ్రాసం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామివారి సన్నిధిలోని గోశాలలో ఉన్న గోవులకు నగరం గ్రామానికి చెందిన ముడకల శ్రీనివాస్, అతని కుటుంబ సభ్యులు గురువారం 45 మోపుల ఎండుగడ్డిని వితరణగా ఇచ్చారు. స్వామివారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు మొగలికుదురుకు చెందిన ములికికోట సత్యసాయిరామ్, విజయలక్ష్మికోటేశ్వరి రూ.10,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులుకు అందించారు. దాతకు అర్చకులు వేదాశీర్వచనం అందించి, స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. దాతలను ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు అభినందించారు.

లక్ష తులసి పూజకు విరాళం



విరాళం అందిస్తున్న రామచంద్రరావు

అంబాజీపేట: అంబాజీపేట చివారు కొర్లపాటి వారిపాలెంలో వేంచేసి ఉన్న శ్రీభూ సమేత వేంకటేశ్వరస్వామి వారి వార్షిక లక్ష తులసి పూజా మహోత్సవానికి చెరుకూరి రామచంద్రరావు, పద్మావతి దంపతులు గురువారం రూ.25 వేలు విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ మేడిద శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యులు, కమిటీ సభ్యుడు మేడిది చిన్న తదితరులు పాల్గొన్నారు.

తాచుపాము హల్‌చల్



తాచుపామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ వర్మ

అంబాజీపేట: సుమారు ఆరు అడుగుల గోధుమ రంగు తాచుపాము బుధవారం స్థానిక విజ్జపు వెంకటరాజు ఆయిల్ మిల్లులో చేరి స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. అప్రమత్తమైన వెంకటరాజు వెంటనే స్నేక్ క్యాచర్ వర్మను సంప్రదించారు. ఆయన అక్కడకు చేరుకుని రేకుల కింద నక్కిన తాచుపామును పట్టుకుని, డబ్బాలో బంధించారు. ఆ పామును నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి విడిచిపెట్టారు. ఇది చాలా ప్రమాదకరమైన పాము అని వర్మ తెలిపారు. పాములతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

యోగాశ్రమం సభ్యుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఆశ్రమం సభ్యులు

రావులపాలెం: స్వామి వివేకానంద యోగాశ్రమం సభ్యులు గురువారం రక్తదానం చేసినట్టు యోగా గురువు శ్రీనివాస్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి, రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, తలసేమియా బాధితులకు రక్తం అందించేలా తమ సభ్యులు 44 మంది రక్తదానం చేశారని చెప్పారు. యోగాశ్రమానికి చెందిన పిల్లి సురేష్, ఎలమంచిలి దుర్గేష్, నామాడి చంటి, నామాడి దుర్గారావు, కట్ట సతీష్, నల్లా ప్రవీణ్ తదితరులు రాజమండ్రి, కాకినాడ గవర్నమెంట్ ఆస్పత్రులతో పాటు, తణుకులో ప్రైవేట్ ఆస్పత్రి, అంబాజీపేటలోని మిస్సమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి అవసరమైన రక్తాన్ని అందించినట్టు వివరించారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.13 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. రాజోలు మండలం పాలగుమ్మికి చెందిన ఉల్లంపర్తి సుజీత్ వయస్సు 14 ఏళ్లు. నెల రోజుల క్రితం బ్రెయిన్‌స్ట్రోక్ రాగా, విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయిస్తున్నారు. ఇప్పటికే ఒక ఆపరేషన్ అయింది. మరో ఆపరేషన్ చేయాల్సి ఉండటంతో, దాతల సాయంతో ఇప్పటికే రూ.14 లక్షల వరకు ఖర్చు పెట్టారు. బాలుడి తండ్రి మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక స్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో బాలుడి తల్లి నాగదుర్గకు సంస్థ సభ్యులు ఆర్థిక సాయం చెక్కును అందజేశారు.

బాలికల వికాసం

- వారి భవిష్యత్తుకు 'కిశోర వికాసం' కార్యక్రమ రూపకల్పన
- ఆరోగ్య పరిరక్షణ, సామాజిక అంశాలు, చట్టాలపై సంపూర్ణ అవగాహన
- గ్రామాల్లో విస్తృతంగా కొనసాగుతున్న కార్యక్రమాలు



జి.అగ్రహారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం బుక్‌లెట్‌ను చూపుతున్న బాలికలు, అంగన్‌వాడీ అధికారులు (ఫైల్)

అంబాజీపేట: కౌమర దశ బాలికల అనారోగ్య సమస్యలు, ఇతర ఒడిదుడుకులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కిశోర వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా వివిధ శాఖలను సమన్వయం చేసుకుని సామాజిక అంశాలతో పాటు, విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ఆయా కార్యక్రమాలు ఈ నెల రెండున ప్రారంభం కాగా, వచ్చే నెల పదో తేదీ వరకూ కొనసాగుతాయి. పి.గన్నవరం నియోజకవర్గంలో 304, రాజోలులో 284, కొత్తపేట నియోజకవర్గంలో 357 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డీఆర్డీ, వీఆర్‌ఏ, ఎంపీహెచ్‌డబ్ల్యూ తదితర బృందాలతో గ్రామాల్లో కిశోర బాలికలకు ఆరోగ్యం, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆత్మరక్షణ, బాల్య వివాహాలకు దూరంగా ఉండటం తదితర విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు.

గ్రామ స్థాయిలో కమిటీ

కిశోర వికాసం కోసం గ్రామ, వార్డు స్థాయిలో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా, ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో అంగన్‌వాడీ కార్యకర్త, బహుళార్థ సాధక ఆరోగ్య కార్యకర్త, గుర్తింపు పొందిన కార్యకర్త, సచివాలయ ఆర్గనైజింగ్ అసిస్టెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ కమిటీ కౌమార బాలికల వివరాలను సేకరించి, బృందాలుగా ఏర్పాటు చేసి వారితో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏర్పాట్లలో మహిళా సంరక్షణ కార్యదర్శి కీలకంగా వ్యవహరిస్తున్నారు. మిగిలిన నలుగురు సభ్యులు సహకరిస్తారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు లేనిచోట అంగన్‌వాడీ కార్యకర్తలే పర్యవేక్షిస్తారు.

కౌమార బాలికల గ్రూపులు

అలాగే 14 నుంచి 18 ఏళ్లలోపు బాలికలు, బడి మానేసిన 11 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలను గుర్తించి వారిని గ్రూపులుగా విభజిస్తారు. వారికి ఎంపిక చేసిన అంశాలపై ఆయా ప్రాంతాల్లో.. బాలికలకు అనువైన సమయంలో గంట పాటు శిక్షణ ఇస్తారు.

ఆత్మస్థైర్యం పెంపొందిస్తాం



కిశోర వికాసం ద్వారా బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా ప్రణాళికలను రూపొందించాం. వేసవి సెలవులు కిశోర బాలికలకు ఉపయోగపడే విధంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారికి సామాజిక అంశాలపై చైతన్యవంతులను చేస్తున్నాం.

– ఎస్‌వీఎస్ మహాలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంబాజీపేట

పూర్తి స్థాయిలో అవగాహన



బాలికలకు ఎదురయ్యే సమస్యలపై కిశోర వికాసంలో పూర్తి స్థాయిలో అవగాహన కలిగిస్తున్నాం. ప్రస్తుత సమాజంలో బాలికలే లక్ష్యంగా మోసాలు పెరుగుతున్నాయి. నిర్దిష్ట ప్రణాళికతో వారికి అవగాహన కలిగించి, అన్ని అంశాల్లో వారు సమర్థంగా ఉండేలా కృషి చేస్తున్నాం.

– రాయుడు మహేశ్వరి, అంగన్‌వాడీ టీచర్, జి.అగ్రహారం

ఇటీవల బాలికలే లక్ష్యంగా మోసాలు, ప్రేమ పేరుతో వంచన, బాల్య వివాహాల వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. బాలికలకు ఎదురయ్యే ఇలాంటి సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగించి, వారు సమర్థంగా ఉండేలా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు కృషి చేస్తున్నారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

రావులపాలెం: జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా రావులపాలెం నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణతో పాటు, పలు క్షేత్రాలను దర్శించుకునేలా ప్రత్యేక బస్సును జూన్ ఆరో తేదీన ఏర్పాటు చేసినట్టు రావులపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ జీజీవీ రమణ గురువారం తెలిపారు. గిరి ప్రదక్షణతో పాటు, తిరుపతి, కాంచీపురం, శ్రీపురం, కాణిపాకం, శ్రీకాళహస్తి, విజయవాడ యాత్రకు సూపర్ లగ్జరీ సర్వీసు ఏర్పాటు చేశామన్నారు. జూన్ ఆరున రావులపాలెం నుంచి బయలుదేరి, ఆయా క్షేత్రాల దర్శనం అనంతరం జ్యేష్ఠ పౌర్ణమి రోజున అరుణాచలం గిరి ప్రదక్షిణ అనంతరం 13వ తేదీన రావులపాలెం చేరుతుందని వివరించారు. ఐదు రోజుల యాత్రకు టికెట్ ధర రూ.3,500గా నిర్ణయించామన్నారు. వివరాలకు డిపో మేనేజర్ 99592 25537, అసిస్టెంట్ మేనేజర్ 73829 11871 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

అయినవిల్లి: జూన్ ఒకటి ఆదివారం కావడంతో సామాజిక పింఛన్లను శనివారమే లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు ఎంపీడీఓ జి.వెంకట సరోవర రావు ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. అలాగే సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పింఛన్ల పంపిణీకి సహకరించాలని ఆదేశించారు.

వినియోగదారుల హక్కులకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ నగేష్

మలికిపురం: సమాజంలో వినియోదారుల హక్కులు, ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తున్నామని మలికిపురం, సఖినేటిపల్లి మండలాల వినియోగదారుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారులు హక్కులు, పరిరక్షణ, ప్రయోజనాలే లక్ష్యంగా సంఘాలు పనిచేస్తున్నాయన్నారు. జిల్లా కన్స్యూమర్ ప్రొటెక్ట్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన శ్రీనివాస నగేష్‌ను సభ్యులు ఘనంగా సత్కరించారు. కొన్ని షాపింగ్ మాళ్లలో కాలం చెల్లిన సరకులు విక్రయిస్తున్నట్లు అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, వీటిపై జిల్లా తూనికలు, కొలతలు, ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. వాణిజ్య సముదాయాల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటిని ప్రతిరోజు కుళాయిల ద్వారా ఇవ్వాలని తదితర సమస్యలపై తీర్మానాలు ఆమోదించింది. నూతన సభ్యులుగా గెడ్డం ఫిలిప్‌రాజు, బోనం వెంకటేశ్వరరావు, నల్లి శివకుమార్, గుబ్బల బాలకృష్ణ సత్యనారాయణను నియమించారు. ఈ సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి కోళ్ల వేణుప్రసాద్, గెడ్డం తులసీభాస్కరరావు, లీగల్ అడ్వయిజర్ ఏలూరి లక్ష్మీసుధ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఇందుకూరి అచ్యుతరామరాజు, పిండి సత్యనారాయణ, పలచోళ్ల రాంబాబు, కేసరి మునీశ్వరరావు, మల్లిపూడి కృష్ణమోహన్, రావూరి పెద్దబ్బులు, వీఆర్వో హరి పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నరేంద్రపురం జెడ్పీ హైస్కూల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

పి.గన్నవరం: మండలంలోని నరేంద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం ఘనంగా జరిగింది. 33 ఏళ్ల క్రితం చదువుకుని వివిధ ప్రాంతాల్లో స్థిర పడిన విద్యార్థులంతా పాఠశాలకు హాజరయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, సెల్ఫీలు దిగారు. ఆటపాటలతో సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సత్కరించారు. మొత్తం 64 మందికి గాను 45 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈసందర్భంగా పాఠశాలకు రూ.10 వేల విరాళం అందించారు. పూర్వ విద్యార్థులందరికీ జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సూర్నీడి కోటేశ్వరరావు, పేపకాయల చంద్రరావు, గుత్తుల సోంబాబు, పీవీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యం తెచ్చిన అహల్యాబాయి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

మామిడికుదురు: మూడు శతాబ్దాల క్రితం రాజమాత అహల్యాబాయి హోల్కర్ మహిళల్లో చైతన్యం తీసుకొచ్చి, ఎన్నో కార్యక్రమాలు రూపొందించారని బీజేపీ పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు అన్నారు. అహల్యాబాయి జయంతి సందర్భంగా గురువారం పాశర్లపూడిలో జరిగిన సమావేశానికి పార్టీ మండల అధ్యక్షుడు బైరిశెట్టి దుర్గారామకృష్ణ అధ్యక్షత వహించారు. దేశ సంస్కృతిని కాపాడిన పవిత్రమూర్తి అహల్యాబాయి అని చెప్పారు. మహిళలు ఆమెను స్ఫూర్తిగా తీసుకుని చైతన్యవంతులు కావాలన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అయినవిల్లి: శానపల్లిలంక, కె.జగన్నాథపురం గ్రామాల్లో పవిత్రమూర్తి అహల్యాబాయి హోల్కర్ జయంతి కార్యక్రమాలు బీజేపీ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మోకా ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పార్టీ నియోజవర్గ కన్వీనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అహల్యాబాయి జీవిత చరిత్రను వివరించారు.

యోగాపై నేడు శిక్షణ

అయినవిల్లి: యోగాపై స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.వెంకట సరోవరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు కె.జగన్నాథపురం, కొండుకుదురు, క్రాప, మాగం, శానపల్లిలంక సచివాలయ సిబ్బంది, 11 గంటలకు మడుపల్లి, నల్లచెరువు, వీరవల్లిపాలెం, వెలువలపల్లి గ్రామాల సచివాలయ సిబ్బందికి, గ్రామస్తులకు యోగా శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

4న వెన్నుపోటు దినం

- మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు
- విజయవంతం చేయాలని పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: ఎన్నికల ముందు ప్రజలకు మాయ మాటలు చెప్పి, తీరా గెలిచాక సంక్షేమ పథకాలు ఇవ్వకుండా మోసం చేసిన కూటమి ప్రభుత్వ దగాకోరుతనానికి నిరసనగా మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వెన్నుపోటు దినం పేరిట జూన్ నాలుగున జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున చేపట్టే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఈ కార్యక్రమం నేపథ్యంలో రాజోలు నియోజకవర్గానికి చెందిన 28 విభాగాల అధ్యక్షులు గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని మహిళలను, రైతులను, యువతను, విద్యార్థులను పథకాల పేరుతో మోసం చేసిన చంద్రబాబు అండ్ కో దగాకోరు విధానాలపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. మోసపోయిన జనానికి అండగా నిలిచి పోరాడాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని చెప్పారు. అందుకే ప్రభుత్వం కళ్లు తెరిపించడానికి ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో తప్పకుండా పాల్గొనాలని, దగాపడ్డ సామాన్య ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యేలా చూడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల అధ్యక్షులు అడబాల బ్రహ్మాజీ, కుసుమ చంద్రశేఖర్, బొలిశెట్టి భగవాన్, రాష్ట్ర నాయకులు కటకంశెట్టి ఆదిత్య, జిల్లా నాయకులు కూనపరెడ్డి రాంబాబు, పాటి శివకుమార్, ఈద రవిరెడ్డి, తోటే జాన్‌బాబు, మోకా సురేష్, ఉచ్చులా విష్ణు, రాజోలు నియోజకవర్గ నాయకులు రుద్రరాజు రంగరాజు, ఉచ్చులా దాసు, జిల్లెళ్ల ఉదయ్, గుర్రం జాషువా తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ వివాదానికి తెర

అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవతో సద్దుమణిగిన వైనం



అంతర్వేదికరలో పరిస్థితిని సమీక్షిస్తున్న డీఎస్పీ, ఆర్డీఓ, ఎమ్మెల్యే



రంగా విగ్రహానికి ముసుగు వేస్తున్న సిబ్బంది

సఖినేటిపల్లి: అంతర్వేదికర గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య రంగా విగ్రహావిష్కరణలో తలెత్తిన వివాదానికి తెరపడింది. గురువారం ఇరు వర్గాల మధ్య తలెత్తిన వివాదం నేపథ్యంలో.. ఆయా వర్గాల వారితో అమలాపురం ఆర్డీఓ కొత్తమాధవి, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ జరిపిన చర్చలు ఫలించాయి. చర్చల్లో ఇరు సామాజిక వర్గాలు సామరస్య వాతావరణంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. రంగా విగ్రహం సరైన రీతిలో ఇరువర్గాలు సమష్టిగా ప్రారంభించేలా, క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారానికి ఈ నెల 31న సీఎం పర్యటన పూర్తయ్యే వరకూ గడువు విధించి.. అధికారులు విగ్రహానికి ఉన్న ముసుగు తొలగించారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని కొత్తపేట సెంటర్‌లో ఎల్‌ఎఫ్ చానల్‌పై ఉన్న కల్వర్టుకు ఒకవైపు అంబేడ్కర్ విగ్రహం ఇప్పటికే ఏర్పాటు చేశారు. రెండో వైపు బస్టాండ్‌కు చేరి రంగా విగ్రహం ఏర్పాటుకు ఓ సామాజిక వర్గం ఇటీవల సన్నాహాలు చేస్తూ వచ్చింది. ఈ క్రమంలో పంచాయతీ తీర్మానాన్ని అనుసరించి ఆ వర్గం ఈరోజు తెల్లవారుజామున రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. విగ్రహం ఏర్పాటుకు అధికారుల అనుమతి లేదంటూ, విగ్రహాన్ని తొలగించాలని మరో వర్గం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు వచ్చి శాంతిభద్రతల దృష్ట్యా విగ్రహాన్ని సమీప ఇంటి ఆవరణలోకి చేర్చారు. తెల్లవారాక తిరిగి అదే విగ్రహాన్ని యథాతథంగా ఆ వర్గం వారు పెద్దఎత్తున తరలివచ్చి మరోసారి ఆవిష్కరించారు. ఈ క్రమంలో గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య వివాదం ముదిరింది. ఈ పరిస్థితుల్లో కొత్తపేట డీఎస్పీ ఘటనా స్థలానికి చేరుకుని శాంతి భద్రతలను పర్యవేక్షించారు. కోనసీమలోని పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి, ఇరు వర్గాలను చెదరగొట్టారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం వివాదం శాంతియుతంగా పరిష్కరించే క్రమంలో స్థానిక పంచాయతీలో ఇరు వర్గాలతో అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తినా, అధికారులు దఫదఫాలుగా వారికి నచ్చజెప్పి ఎట్టకేలకు ఓ అంగీకారానికి తెచ్చారు. కల్వర్టుకు ఓ వైపునున్న అంబేడ్కర్ విగ్రహం ఎత్తు కంటే తక్కువ ఎత్తులో అదే చోట రంగా విగ్రహం పెట్టడానికి మరో వర్గం సూత్రప్రాయంగా అంగీకరించడంతో చర్చలు సఫలమయ్యాయి. అయితే రంగా విగ్రహం దిమ్మ పక్కనే జాతీయ జెండా దిమ్మ కట్టడానికి అధికారులు తగిన నిర్ణయాలు తీసుకోవడానికి, అంతవరకూ రంగా విగ్రహానికి ముసుగు వేయడానికి అంగీకారానికి వచ్చారు. చివరగా డీఎస్పీ, ఆర్డీఓ, ఎమ్మెల్యే సమక్షంలో తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కె.సూర్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది విగ్రహానికి ముసుగు వేయడంతో పరిస్థితి సద్దుమణిగింది.

సారా రహిత గ్రామంగా గాజులగుంట



గాజులగుంటలో జరిగిన కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ కాత్యాయని

పి.గన్నవరం: ప్రభుత్వం ప్రారంభించిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ముంగండపాలెం శివారు గాజులగుంట గ్రామాన్ని సారా రహిత గ్రామంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రకటించినట్టు కొత్తపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఏపీని సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో గురువారం గాజులగుంట గ్రామంలో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కాత్యాయని మాట్లాడుతూ, సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గాజులగుంటను సారా రహిత గ్రామంగా ప్రకటించడంతో గ్రామస్తులను అభినందించారు. సమావేశంలో సర్పంచ్ శృంగవరపు లక్ష్మణరావు, ఎక్సైజ్ ఎస్సై ఎం.రామచంద్రం, పంచాయతీ కార్యదర్శి టీవీ రమణ, వీఆర్వో కె.దుర్గా వరలక్ష్మి, వీఆర్‌ఏ రామారావు, పలువురు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

జీవితంలో యోగా భాగం కావాలి



కొత్తపేటలో యోగాసనాలు వేస్తున్న సచివాలయాల సిబ్బంది



మామిడికుదురులో యోగా సాధన చేస్తున్న ఉద్యోగులు

కొత్తపేట: ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలని ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ అన్నారు. యోగాంధ్రా మాసోత్సవం శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో యోగా సాధన నిర్వహించారు. ఎంపీడీవో నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామ సచివాలయాల ఉద్యోగులు యోగాసనాలు వేశారు. సూర్యనాడి, చంద్రనాడి, వృక్షాసనం, పర్వతాసనం తదితర భంగిమల్లో యోగా చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, నిత్యం గంట పాటు ధ్యానం, యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. ప్రస్తుతం పని ఒత్తిడి పెరిగి మానసిక రుగ్మతలకు లోనవుతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నిత్యం కొంత సమయం యోగా, ధ్యానానికి కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, మండల పరిషత్ ఏఓ ఎం హరికృష్ణారెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ డి.సుబ్బారావు, సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలి ఆలయంలో శిక్షణ

అంతర్జాతీయ యోగా దినోత్సవం, యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవ అండ్ గోపాలస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో యోగా శిక్షణ నిర్వహించారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజవరం ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం, యోగా శిక్షకుడు పెనుమత్స వెంకటరాజు స్థానికులతో యోగాసనాలు వేయించి, అవగాహన కల్పించారు. ఈ నెల 31న, వచ్చే నెల 4న ఉదయం 7.30 నుంచి యోగా శిక్షణ నిర్వహిస్తారని ఈఓ తెలిపారు.

యోగాతో ఆరోగ్యానికి మేలు

మామిడికుదురు: యోగా ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని నిపుణులు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన ఉచిత యోగా శిక్షణలో రైతులు, వ్యవసాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయడం వల్ల మనస్సు ఎంతో ఉత్తేజం కావడంతో పాటు, మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు.

దేవస్థానం భూముల కౌలు వేలం ఖరారు

కాజులూరు: మండలంలోని కోలంకలో ఉన్న శ్రీదేవి, భూదేవీ సమేత కేశవస్వామి, సోమేశ్వర స్వామి ఆలయాలకు చెందిన సాగు భూమి కౌలుకు వేలం పాటలు ఖరారైనట్టు కేశవస్వామి ఆలయ కార్య నిర్వహణాధికారి సోమరాజు తెలిపారు. గురువారం కోలంక కేశవస్వామి ఆలయ ప్రాంగణంలో అధికారులు కౌలు వేలంపాట నిర్వహించగా, కోలంక ఆలయానికి చెందిన ఆరు ఎకరాలకు గతంలో రూ.1.50 లక్షల లీజు ఉండగా, ప్రస్తుతం శీలం నాగేశ్వరరావు ఏటా రూ.1.71 లక్షలకు వేలం పాడుకున్నారన్నారు. అలాగే సోమేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 7.67 ఎకరాలకు గతంలో రూ.1.80 లక్షల లీజు ఉండగా, ప్రస్తుతం బోండా వెంకటబాబు రూ.2.02 లక్షలకు పాడుకున్నారని ఈఓ తెలిపారు. మూడేళ్ల పాటు కౌలుదారులకు ఇదే లీజు వర్తిస్తుందని, ఏడాది లీజు మొత్తం ముందుగానే చెల్లించాలన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

అలమూరు: జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించే వరకూ రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన చేయకూడదంటూ ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రవికుమార్ అన్నారు. ఆలమూరులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా విద్యారంగంలో అనేక సమస్యలు పరిష్కరించాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. స్థానిక జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరినా, పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. దీనివల్ల అందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. పేద, బలహీన వర్గాలకు ఉచిత విద్య కొరవడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా సమస్యలపై ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి, సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.